క్లుప్తంగా

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థుల దంతాలను పరిశీలిస్తున్న ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వైద్యుడు విశ్వనాథ్

అచ్యుతాపురం: ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ ఎ.విశ్వనాథ్ సూచించారు. మండలంలోని కొండకర్ల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్లోరోసిస్ దంతాలకు, ఎముకలకు వచ్చే అవకాశం ఉందని, ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుర్‌కురే, లేస్, పానీపూరీ, న్యూడిల్స్ వంటి చిరుతిళ్లను ఆహారంగా తీసుకోవడంతో చిన్నారులకు, ఖైనీ, పాన్ పరాగ్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను తినడంతో పెద్దలకు ఫ్లోరోసిస్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థుల దంతాలను పరిశీలించిన ఆయన అనుమానం ఉన్న విద్యార్థులకు విటమిన్ సీ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు అరుణజ్యోతి, ప్రోత్సాహిణి, షాన్వాజ్, వైద్య సిబ్బంది మంగ, లక్ష్మి, శ్రీదేవి, శేషారత్నం పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. బదిలీపై వెళ్తున్న మునగపాక సచివాలయ ఉద్యోగులను సోమవారం అప్పారావు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణ తప్పనిసరి అన్నారు. అయితే పనిచేసే ప్రాంతాల్లో ప్రజలకు అందించే సేవలు గుర్తింపునిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ నారాయణరావు మృతికి సంతాపం



పెదపాటి నారాయణరావు(ఫైల్)

యలమంచిలి రూరల్: యలమంచిలి ఫొటోగ్రాఫర్ల సంఘం వ్యవస్థాపకుడు, సీనియర్ ఫొటోగ్రాఫర్ పెదపాటి నారాయణరావు(63) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పట్టణంలోని మామిడి అపార్ట్‌మెంట్‌లోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. మొదటితరం ఫొటోగ్రాఫర్లలో ఒకరైన నారాయణరావు పట్టణంలో సరోజ ఫొటో స్టూడియో నిర్వహించారు. మీడియా, పోలీసులకు ఫొటోలు తీసి సేవలందించారు. యలమంచిలి పట్టణంలో పలువురు ఔత్సాహిక యువకులకు ఫొటోగ్రఫీపై శిక్షణనిచ్చారు. నారాయణరావు మృతి పట్ల యలమంచిలి ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాము, రమణ, సభ్యులు చిన్నాజీ, నానాజీ, నాని, యలమంచిలి మున్సిపల్ వైస్‌చైర్మన్ అర్రెపు గుప్తా, పలువురు పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు. పలువురు పాత్రికేయులు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సోమవారం యలమంచిలి హిందూ శ్మశానవాటికలో నారాయణరావు అంత్యక్రియలు పూర్తి చేశారు.

అధ్వానంగా సాగునీటి కాలువ



మునగపాకలో తుప్పలతో దర్శనమిస్తున్న సాగునీటి కాలువ

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో చెరువు కాలువ పరిధిలోని సాగునీటి కాలువ అధ్వానంగా దర్శనమిస్తోంది. కాలువ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈ కాలువ ఆధారంగా పంటలు సాగుచేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కాలువ కింద చెరకు, వరితో పాటు ఇతర పంటల సాగు చేపడుతుంటారు. అయితే కాలువ స్వరూపం మారిపోవడంతో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే పరిస్థితులు లేకుండాపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా కాలువ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మేలైన జన ఔషధి

- చౌక ధరలకే అన్ని రకాల మందులు
- యలమంచిలిలో రెండు జనరిక్ మందుల షాపులు



యలమంచిలిలో జనరిక్ మందుల షాపు

యలమంచిలి రూరల్: అసలే వర్షాకాలం.. కాలానుగుణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక జబ్బులు ఇబ్బంది పెట్టే కాలమిది. మందుల కోసం ఔషధ దుకాణాలకు వెళ్తే ధరలు మండిపోతున్నాయి. అయితే తక్కువ ధరకు లభించే జన ఔషధి దుకాణాలపై అవగాహన లేక చాలా నష్టపోతున్నారు. అధిక శాతం ప్రజలు దీనిపై అవగాహన లేక బ్రాండెడ్ మందులను కొనుగోలు చేస్తూ జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా, కరూర్ వైశ్యా బ్యాంక్(కేవీబీ) గ్రౌండ్ ఫ్లోర్‌లో మరొకటి జనరిక్ మందుల షాపులు అందుబాటులో ఉన్నాయి. వీటిని సద్వినియోగపర్చుకోవాలని నిర్వాహకులు, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మూలకం ఒక్కటే.. ధరలోనే వ్యత్యాసం

ఏ మూలకంతో మందును తయారు చేస్తారో దాని పేరుతోనే విక్రయించే వాటిని జనరిక్ మందులుగా వ్యవహరిస్తారు. వాటిపై ఆ మూలకం పేరు మాత్రమే ముద్రిస్తారు. ఇతర బ్రాండెడ్ కంపెనీల్లాగా ఆకర్షణీయమైన డబ్బాలు, పేర్లు ఉండవు. జనరిక్ ఔషధాల మూలకమే స్వదేశీ, విదేశీ కంపెనీల ఉత్పత్తిదారులు వాడుతారు. ఈ రెండింటిలోనూ మూలకం ఒక్కటే ఉంటుంది. ధరలలోనే తేడా కనిపిస్తుంది. పెద్ద ఔషధ సంస్థలు వారి ఉత్పాదనకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టుకుని ప్రచార ప్రకటనలకు అధికంగా ఖర్చు చేసి అత్యధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటారు. కొందరు వైద్యులు తమ లాభం కోసం ఆ మందులను అంటగట్టడం వల్ల సామాన్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఎన్‌ఎంసీఆర్‌ఎంపీ నిబంధనలిలా..

సామాన్యులకు జనరిక్ మందులు రాయాలంటూ 2002లోనే భారత వైద్య మండలి(ఐఎంసీ) నిబంధనలను రూపొందించినప్పటికీ రాయకపోతే తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించలేదు. 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్(ఎన్‌ఎంసీఆర్ ఎంపీ) నియమావళి-2023ను తీసుకురాగా అది అమల్లోకి తెచ్చినట్టు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. దాని ప్రకారం రోగులకు చౌకగా లభించే జనరిక్ మందులను సిఫార్సు చేయాలని, చేయని వైద్యుల లైసెన్స్ రద్దు చేయడం లాంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయినా ఇది పటిష్టంగా అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి.

ధరల్లో వ్యత్యాసాలిలా..(రూపాయల్లో)

మందు	కేటగిరి	జన ఔషధి	జనరిక్	బ్రాండెడ్
పారాసిటమాల్(10)	జ్వరానికి	10	25	36
క్లిండిపిన్ 10ఎంజీ	బీపీ	16.5	40	133
టెల్మిసార్టన్-40	బీపీ	12	30	75.71
మెటప్రోలాల్-25	బీపీ	6.6	20	71.4
అమ్లోడిపిన్-10	బీపీ	10	20	61.04
మెట్‌ఫార్మిన్-500	డయాబెటిక్	6.6	12	20.4
ఇన్సులిన్ 30/70	డయాబెటిక్	90	130	174
ప్యాంటప్రజోల్	గ్యాస్	12.1	35	151.97
ర్యాబిప్రజోల్-20	గ్యాస్	8.8	30	109.55
ఎసమప్రజోల్-40	గ్యాస్	20.9	35	174
అటోర్వాస్టాటిన్-10	గుండె	8.8	30	82.9
రోజువాస్టాటిన్-10	గుండె	18.7	50	226
ఎసైక్లో+పారాసిటమాల్	పెయిన్‌కిల్లర్	10	25	73
డైక్లోఫెనాక్ ఆయింట్‌మెంట్	పెయిన్‌కిల్లర్	24	50	165.5

ప్రభుత్వ ప్రచారం అవసరం



జన ఔషధి, జనరిక్ మందులకు ప్రభుత్వం ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు తప్పనిసరిగా జనరిక్ మందులను సూచిస్తే ప్రజలకు అవగాహన కలుగుతుంది. దీని వల్ల పేదలకు మేలు కలుగుతుంది. మా దుకాణానికి వచ్చే వారికి జనరిక్, బ్రాండెడ్ మందుల మధ్య వ్యత్యాసం వివరిస్తూ జనరిక్ ఔషధాలు కూడా బాగా పనిచేస్తావని చెబుతున్నాం. ఇప్పుడిప్పుడే జనరిక్ మందులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

– ఎస్.నాగేశ్వరి, జనరిక్ మందుల దుకాణం నిర్వాహకురాలు

ధర్మశ్రీకి మామిడివాడ నేతల శుభాకాంక్షలు



కరణం ధర్మశ్రీని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మామిడివాడ నేతలు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కరణం ధర్మశ్రీని సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మామిడివాడకు చెందిన మాజీ సర్పంచ్ నెట్టం సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మోటూరు రాఘవేంద్ర, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



మునగపాక ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మునగపాక: మునగపాక మెయిన్‌రోడ్డులోని ఓ ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని సోమవారం సాయంత్రం తనిఖీ అధికారులు పరిశీలించారు. దుకాణంలోని స్టాక్‌కు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. మందులు ఏయే ధరలకు అమ్ముతున్నారనే వివరాలను సేకరించారు. రికార్డులు సంతృప్తికరంగా ఉన్నట్లు విజయనగరం ఏడీఏ కె.మహారాజన్, తనిఖీ అధికారులు సింహాచలం, రంగాచారి, సరోజిని, తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



రూ.2 లక్షల విరాళం అందిస్తున్న అప్పలనాయుడు, యశోద దంపతులు

మునగపాక: వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వెంకన్న ఆలయానికి పలువురు భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన ఆడారి దొరమ్మ గారి అప్పన్న కుమారుడు అప్పలనాయుడు, యశోద దంపతులు, మనుమడు దినేష్ రూ.2 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చురుగ్గా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట వెంకట్, అలంక ప్రకాశరావు, ఆడారి లక్ష్మణరావు, పొలిమేర కృష్ణ, బొడ్డేడ రామునాయుడు, ఆడారి గణేష్, మద్దాల వీరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి శ్రీదేవి

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శ్రీదేవి ఆదేశించారు. సోమవారం ఆమె వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డార్మిటరీలను పరిశీలించారు. వసతి గృహంలో అదనపు గదులు, మరుగుదొడ్లు నిర్మాణంలో ఉండటం, కొన్ని మరమ్మతు పనులు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం విద్యార్థులు ఉండే డార్మిటరీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వసతి గృహంలో ఆవరణ అంతా పిచ్చిమొక్కలు, గడ్డి ఉండడంతో తక్షణమే తొలగించాలని సూచించారు. ఆరుబయట మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది పడకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో కుంచం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పనిచేయాలి



బీఎల్‌వోలతో సమావేశమైన ఈఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా బీఎల్‌వోలు పని చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి గీతాంజలి సూచించారు. సోమవారం ఆమె మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలో బీఎల్‌వోలతో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ బూత్‌ల గుర్తింపు, సమస్యలపై నివేదికలు తయారు చేయాలన్నారు. త్వరలోనే ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు విడుదల కానున్నాయని, ఆ మేరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వోలకు కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింహమూర్తి, డీటీ నారాయణరావు, 50 మంది బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బండరాళ్ల లారీ బోల్తా

లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు





పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ దేవుళ్లునాయుడు, క్లీనర్ వంశీ



తాళ్లపాలెం సంత వద్ద బోల్తా పడిన రాళ్ల లారీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. రోలుగుంట నుంచి అనకాపల్లి వైపు బండరాళ్లు తీసుకెళ్తున్న లారీ తాళ్లపాలెం సంత వద్ద మలుపు తిరుగుతూ అదుపు తప్పి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో డ్రైవర్ హెచ్. దేవుళ్లునాయుడు, క్లీనర్ వంశీ గాయపడ్డారు. స్థానికులు వీరిని లారీ క్యాబిన్ నుంచి వెలికి తీసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందారు. ఈ ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేదంటే ప్రాణహాని జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధ

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ప్రిన్సిపాల్ బి.రాధ సోమవారం తెలిపారు. స్థానిక కళాశాలలో జనరల్ కోర్సులో కెమిస్ట్రీ, ఒకేషనల్ కోర్సులో ఈటీ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. కెమిస్ట్రీ పోస్టుకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 50 శాతంతో ఉత్తీర్ణత, ఈటీ పోస్టుకు బీటెక్ ఈఈఈలో 50 శాతంతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను అర్హులుగా పరిగణిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల లోపు స్థానిక కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకున్న వారంతా బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లిలోని రాజా సినిమా థియేటర్‌కు ఎదురుగా ఉన్న జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో) కార్యాలయానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ రాధ సూచించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కోటవురట్ల: నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయని, ఇది నిరుద్యోగ యువతకు మంచి అవకాశమన్నారు. ఆసక్తి ఉన్నవారు నైపుణ్యం పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ధ్రువపత్రాలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ



విద్యార్థులకు సామగ్రిని అందిస్తున్న వ్యాపారి కోటేశ్వరరావు

ఎస్.రాయవరం: దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో మంచి ఫలితాలు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్ అన్నారు. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన కొబ్బరి వ్యాపారి కర్రి కోటేశ్వరరావు.. విద్యార్థులకు సోమవారం స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తమ పాఠశాలకు గతంలో సుమారు 20 వేలు విలువ చేసే కొబ్బరి మొక్కలు కూడా కోటేశ్వరరావు సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపోలు శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: రాంబిల్లి, యలమంచిలి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి పట్టణం, కొత్త ఎర్రవరం, కొత్తపాలెం గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, సోమలింగపాలెం, కట్టుపాలెం గ్రామాల్లో సాధారణ, వాణిజ్య, ఇతర విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిపివేత ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అందుకు తగినట్టుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

పల్లపు ఆనందపురంలో వృద్ధురాలి మృతి



జోగమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం గ్రామానికి చెందిన వృద్ధురాలి మృతిపై మునగపాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రసాదరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రి జోగమ్మ(60) ఒంటరిగా జీవనం సాగిస్తూ రోజువారీ కూలీ పనులు చేసుకుంటోంది. సోమవారం ఉదయం 10 గంటలు కావస్తున్నా, ఆమె ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు అటువైపుగా వెళ్లి చూడగా చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మృతురాలి సోదరుడు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. మృతురాలి శరీరంపై బయటకు కనిపించే గాయాలు లేవని చెప్పారు. మంగళవారం జోగమ్మ మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కష్టకాలంలో అండగా నిలిచిన స్నేహ బంధం



ఉషారాణికి సాయం అందిస్తున్న తోటి స్నేహితులు

అచ్యుతాపురం రూరల్ : గెట్ టు గెదర్ పార్టీలు ఏర్పాటు చేసుకుని సందడి చేయడమే కాదు.. కష్టంలో ఉంటే ఆదుకోవడంలో కూడా స్నేహితులు ముందుంటారని 2002-03 బ్యాచ్ అచ్యుతాపురం హైస్కూల్ విద్యార్థులు నిరూపించారు. కష్టంలో ఉన్న తోటి స్నేహితురాలికి బాసటగా నిలిచి అందరి మన్ననలు పొందారు. పోడపల్లి జగనన్న కాలనీలో నివాసముంటున్న ఈ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని మైలపల్లి ఉషారాణి ఇటీవల పరిశ్రమలో విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులంతా కలిసి సేకరించిన రూ60 వేలను ఉషారాణికి సోమవారం అందజేశారు. భర్త ప్రేమకు దూరమైన తనకు స్నేహితులు అండగా నిలబడడం ఆనందంగా ఉందని ఉషారాణి చెప్పారు. తన కూతురు చదువుకు ఆటంకం కలగకుండా స్నేహితులు మనోధైర్యాన్ని కలిగించారన్నారు.

ఆగని మట్టి దోపిడీ



పూడి ఏపీఐఐసీ పరిధిలో కంపెనీలకు కేటాయించిన ప్రాంతంలో చేపట్టిన గ్రావెల్ తవ్వకాలు

రాంబిల్లి(అచ్యుతాపురం): యలమంచిలి నియోజకవర్గంలో మట్టి దోపిడీ ఆగడం లేదు. మండలాలవారీగా రోజుకొక కొండను గుల్ల చేస్తున్నారు. నియోజకవర్గంలో సెజ్ కార్యకలాపాలకు, రహదారుల విస్తరణకు, లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్, మట్టికి డిమాండ్ పెరిగింది. పూడి రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీ ద్వారా పలు కంపెనీలకు కేటాయించిన భూముల్లోని గ్రావెల్‌ను, కొండల్ని తవ్వేస్తూ రాత్రికి రాత్రే తరలించేస్తున్నారు. పూడి ఏపీఐఐసీ పరిధిలో తవ్విన గ్రావెల్‌ను లారీలతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా లారీ మట్టి లోడు రూ.9 వేలు చొప్పున వందలాది లారీలతో తరలించి కూటమి నేతలు అక్రమార్జన చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఏఎన్‌ఎం సుజాతకు సత్కారం



పాటిపల్లి ఏఎన్‌ఎం సుజాతను సత్కరిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి నాగలక్ష్మి

మునగపాక: కరోనా కష్టకాలంలో ప్రజలకు మెరుగైన సేవలందించిన ఏఎన్‌ఎం సుజాత సేవలు అభినందనీయమని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి మద్దాల నాగలక్ష్మి అన్నారు. పాటిపల్లి సచివాలయ ఏఎన్‌ఎంగా సేవలందించి బదిలీపై వెళ్తున్న సుజాతను సోమవారం పాటిపల్లి సచివాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ విజిటర్ సీతామహాలక్ష్మి, ఆరోగ్య సూపర్‌వైజర్‌లు నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గా, ఆశ కార్యకర్తలు భవాని, వెంకటలక్ష్మి, అప్పలనర్స, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న శక్తి టీం సభ్యులు కనకం

కె.కోటపాడు : మహిళల భద్రతలకు పోలీస్‌శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు కె.కోటపాడు శక్తి టీం సభ్యులు కనకం అన్నారు. కె.కోటపాడు ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ సూచనల మేరకు కె.కోటపాడులో కళాశాలల విద్యార్థినులకు, చౌడువాడ హైస్కూల్ వద్ద విద్యార్థినులకు వారి భద్రతపై తీసుకుంటున్న చర్యలు, సైబర్ నేరాలపైనా సోమవారం అవగాహన కల్పించారు. కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులపై ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలకు ఎవరి వల్ల నైనా ఇబ్బందులు పడితే 1093, 112, 181, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే వెంటనే వచ్చి రక్షణ కల్పించనున్నట్టు కనకం తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీను పాల్గొన్నారు.